క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



భీమలింగేశ్వరస్వామికి కల్యాణం జరిపిస్తున్న దంపతులు

జామి: మండలంలోని కొత్త భీమసింగిలో భీమలింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు బాబ్జీ ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, కల్యాణం జరిపించారు. గ్రామానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేత్ర వైద్యశిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

చీపురుపల్లి: పట్టణంలోని ఆంజనేయపురంలో మానవీయత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరం విజయవంతమైంది. విజయనగరానికి చెందిన పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్యులు 52 మంది రోగులను పరీక్షించి, 16 మందిని కాటరాక్ట్ శస్త్రచికిత్సకు, మరో ఇద్దరిని కార్నియా శస్త్రచికిత్సకు ఎంపిక చేశా రు. మిగిలిన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆ సంస్థ అధ్యక్షుడు బి.వి.గోవిందరాజులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి



జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

బొండపల్లి: మత్తు పదార్థాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని ఎస్‌ఐ ఎస్. రవి పిలుపునిచ్చారు. మండలంలోని జాతీయ రహదారి 26కు ఇరువైపులా పలు కూడళ్ల వద్ద మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మత్తు పదార్థాలకు బానిసలైతే జీవితం నాశనమవుతుందన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయం సందర్శన



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ పట్నాయక్

వేపాడ: మండలంలోని సోంపురం గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ కె.ఎస్.ఎస్.బి. పట్నాయక్ సోమవారం సందర్శించారు. సర్పంచ్ మురిపిండి గంగరాజు, ఎంపీటీసీ సభ్యుడు సత్యనారాయణ సమక్షంలో సచివాలయ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. గ్రీవెన్స్‌సెల్‌లో ప్రజలు తెలియజేసిన సమస్యలను వెంటవెంటనే పరిష్కరించాలని సూచించారు. ఇంటిపన్ను వసూలుపై దృష్టి సారించాలన్నారు.

డీఈసీ మాత్రల పంపిణీ



విద్యార్థులతో మాత్రలను మింగిస్తున్న హెచ్‌ఎమ్ గౌరినాయుడు

గజపతినగరం: రెండేళ్లు పైబడిన వారందరికీ మరుపల్లి పీహెచ్‌సీ సిబ్బంది నులిపురుగు, ఫైలేరియా నివారణకు అల్బెండజోల్, డీఈసీ మాత్రలు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను సోమవారం సందర్శించి విద్యార్థులతో మాత్రలు మింగించారు. గజపతినగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రధానోపాధ్యాయుడు డి.గౌరినాయుడు ఆధ్వర్యంలో.. వెంకటాపురం, పురిటిపెంట, ఎస్.జి.ఆర్.పురం, తదితర గ్రామాల్లో మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ధ్యానంతోనే సంపూర్ణ ఆరోగ్యం



ధ్యానంపై అవగాహన కల్పిస్తున్న బ్రహ్మర్షి ప్రేమ్‌నాథ్

బొండపల్లి: ప్రతిరోజూ క్రమం తప్పకుండా ధ్యానం చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని బ్రహ్మర్షి ప్రేమ్‌నాథ్ అన్నారు. మండలంలోని గొట్లాంలో గల షిర్డీసాయి ఆలయంలో ధ్యానంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ క్రమంతప్పకుండా ధ్యానం చేయాలన్నారు. ఇంటి ఆవరణంలో సేంద్రియ పద్ధతిలో కూరగాయలను సాగుచేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పిరమిడ్ జిల్లా సేవాదళ్ వి.రామకృష్ణం రాజు యోగా సాధకులు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఎన్నికల కోడ్ అమలు



దత్తిరాజేరు: మండల అధికారులతో సమావేశమైన తహసీల్దార్ రమేష్



కొత్తవలస: అధికారులతో ఎన్నికల నియమావళి అమలు తీరుపై చర్చిస్తున్న తహసీల్దార్ ప్రసాదరావు

దత్తిరాజేరు: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మండలంలో ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయాలని మండల రెవెన్యూ, సచివాలయ కార్యదర్శులను తహసీల్దార్ రమేష్ ఆదేశించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, ఎస్‌ఐ రాజేష్, సచివాలయ కార్యదర్శులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండల పరిధిలో చెడ్డపేరు రాకుండా ఎన్నికలను సజావుగా నిర్వహిద్దామని అన్నారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు ఇప్పటికే తొలగించామని, రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయించాలని సూచించారు. ఓట్ల కోసం ప్రలోభపెట్టేవారిపై చర్యలు తప్పవని అన్నారు. అధికారులు బృందాలుగా ఏర్పడి ఫోటో గ్రాఫర్‌తో నిత్య పరిశీలన చేయాలని ఆదేశించారు.

సహకరించాలి

మెరకముడిదాం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా అంతా సహకరించాలని ఎంపీడీఓ పి.రామృకృష్ణ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేస్తామని తెలిపారు. ఇప్పటికే అన్ని పార్టీల నాయకులతో మాట్లాడి ఎన్నికల కోడ్ అమలుకు సహకరించాలని కోరామన్నారు. గ్రామాల్లో రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను తొలగిస్తున్నామని, రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయిస్తున్నామని స్పష్టం చేశారు.

ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు

కొత్తవలస: ఎమ్మెల్సీ ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించే రాజకీయపార్టీలపై కఠిన చర్యలు తప్పవని సహాయ ఎన్నికల అధికారి, తహసీల్దార్ డి.ప్రసాదరావు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల నియమావళి పర్యవేక్షణ అధికారులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభలు, సమావేశాలు, ర్యాలీలు తదితర కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ముందస్తుగా అనుమతులు తీసుకోవాలన్నారు. అలాగే పార్టీలకు చెందిన జెండాలు, కరపత్రాలు, పోస్టర్లను ప్రభుత్వ భవనాలు, ఆస్తులపై పెట్టరా దన్నారు. ఈవిధంగా చేస్తే సంబంధిత పార్టీ లపై ఎన్నికల నియమావళిలో భాగంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల కోడ్ అమలును పరిశీలించేందుకు సీఎస్‌డీటీ రమేష్, ఈఓపీఆర్డీ ధర్మారావు, ఏఎస్‌ఐ శ్రీనివాసరావుతో ఫ్లైయింగ్ స్క్వాడ్‌ను నియమించామని తెలిపారు. ఎన్నికలకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు. సీఐ ఎస్.బాలసూర్యావు, ఎంపీడీఓ వై.పద్మజ, డిప్యూటీ తహసీల్దార్ హర్షవర్ధని, ఈఓపీఆర్డీ ధర్మారావు పాల్గొన్నారు.

ఒత్తిడిని జయిస్తేనే విజయం

గుర్ల: విద్యార్థులు ఒత్తిడి జయిస్తేనే విజయం సాధించగలరని జిల్లా ఉప విద్యాశాఖ అధికారి, బొబ్బిలి డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. తిరుపతినాయుడు సూచించారు. మండల కేంద్రంలోని కేజీబీవీలో సోమవారం నిర్వహించిన పరీక్ష పర్వం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు పరీక్షలలో ఒత్తిడి గురికాకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది, ఇంటర్మీడియట్ విద్యార్థులు పరీక్షలు రాస్తున్న సమయంలో మానసిక ఆందోళనకు గురికాకుండా ఉండాలని సూచించారు. అవగాహన కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంఈఓ పుష్పారావు, ఎస్‌ఓ జానకి పాల్గొన్నారు.



గుర్ల: అవగాహన కల్పిస్తున్న తిరుపతినాయుడు



చీపురుపల్లి: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డైట్ ప్రిన్సిపాల్ ఎన్.తిరుపతినాయుడు

మానసిక స్థైర్యాన్ని పెంపొందించుకోవాలి..

చీపురుపల్లి: పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు మానసిక స్థైర్యాన్ని పెంపొందించుకోవాలని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.తిరుపతినాయుడు అన్నారు. పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/కళాశాలలో పది, ఇంటర్మీడియట్ విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ, పరీక్షలకు దృఢ సంకల్పంతో సిద్ధం కావాలని సూచించారు. పరీక్షల్లో ఏకాగ్రత కుదరాలంటే మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండాలన్నారు. ప్రణాళికాబద్ధంగా చదివితే విజయాలు తప్పకుండా సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డైట్ అధ్యాపకుడు డి.ఈశ్వరరావు, స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ ఎ.రాణిశ్రీ, బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్యామలసాయి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ పుస్తకాల పంపిణీ



చీపురుపల్లిలో పాఠకుడికి పుస్తకాలు అందజేస్తున్న ఆశయ సంస్థ ప్రతినిధులు

చీపురుపల్లి: పట్టణానికి చెందిన ఆశయ రూరల్ లైబ్రరీ ఆధ్వర్యంలో ఇంటింటికీ పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ఆ సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ సోమవారం ప్రారంభించారు. చీపురుపల్లితో పాటు పరిసర గ్రామాలకు చెందిన పాఠకులు తమ సంస్థకు ఫోన్ చేస్తే మొబైల్ లైబ్రరీ ద్వారా వారికి నీతి కథలు, చరిత్ర తదితర పుస్తకాలను ఉచితంగా అందజేస్తున్నామని చెప్పారు. నెల రోజుల పాటు పుస్తకాలు చదువుకుని తిరిగి సంస్థకు అందించాల్సి ఉంటుందని తెలిపారు. సెల్ ఫోన్ల ప్రభావం విపరీతంగా పెరిగిపోతున్న ప్రస్తుత తరుణంలో విద్యార్థులు, యువతను దానిని నుంచి దూరం చేసి తిరిగి పుస్తక పఠనం వైపు మళ్లించేలా చేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆ సంస్థ జాయింట్ సెక్రటరీ ఎస్.వి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కిశోర్‌కుమార్

గజపతినగరం రూరల్: మండలంలోని దావాలపేట గ్రామంలోని వంక చెరువులో చేపడుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ కె.కిశోర్‌కుమార్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వేతనదారులతో మాట్లాడుతూ ఉపాధి సిబ్బంది ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు గరిష్ఠ వేతనం రూ.250 అందుతుందని అన్నారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పిస్తామని తెలిపారు. ఆయన వెంట ఏపీఓ సీహెచ్.రామారావు ఉన్నారు.

ఫేస్‌యాప్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

వేపాడ: ఫేస్ యాప్ (ముఖ ఆధారిత హాజరు) నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని వీఆర్‌ఏలు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కృష్ణంరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏల సంఘ మండల నాయకులు గట్టు వెంకన్న, అప్పారావు, సూర్యనారాయణ, గురువులు, తదితరులు మాట్లాడుతూ, సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 14న కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



తహసీల్దార్ కృష్ణంరాజుకు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు

ప్రజలందరిపై లయకారుడి ఆశీస్సులు

- నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి



సర్వాంగ సుందరంగా అలంకరించిన మహాశివలింగాలు

విజయనగరం టౌన్: లయకారుడైన పరమశివుని ఆశీస్సులు ప్రతి ఒక్కరిపైనా ఉండాలని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ఆకాంక్షించారు. ఈ నెల 18న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో టౌన్ సెంటర్ లేఅవుట్‌లో ఉన్న సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మహాశివరాత్రి ఉత్సవాలలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సనాతన సంప్రదాయాలను కాపాడుతూ, భావితరాలకు తెలియజెప్పే విధంగా ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అజ్ఞానమనే చీకటి నుంచి ప్రతి ఒక్కరికీ పరమశివుడు జ్ఞానజ్యోతిని ప్రసాదించాలన్నారు. ప్రజాపిత బ్రహ్మకుమారీస్ సంస్థ నిర్వాహకురాలు అన్నపూర్ణ శివరాత్రి ప్రాశస్త్యాన్ని వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్ కనకల సుజాతతో పాటూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రూ. 2 లక్షలతో సీసీ రోడ్డు



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ అర్జునమ్మ

వేపాడ: మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు సుమారు 60 మీటర్ల మేర సీసీ రోడ్డును రెండు లక్షల రూపాయలతో సోమవారం నిర్మించారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా మంజూరైన నిధులతో రోడ్డు వేయించామని సర్పంచ్ మిరపాక అర్జునమ్మ తెలిపారు. పనులను సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ విజయ్, వార్డుమెంబర్ వెంకటరమణ పర్యవేక్షించారు.

ఆలయ అభివృద్ధికి రూ.50వేల విరాళం



ఆలయ కమిటీకి నగదు అందజేస్తున్న దాత సరయ్యశెట్టి

కొత్తవలస: కొత్తవలస మేజర్ పంచాయతీ పరిధి డ్రైవర్స్ కాలనీలోని శ్రీ లక్ష్మీగణపతి ఆలయ అభివృద్ధికి మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్ మామిడి సరయ్యశెట్టి తన నివాసంలో రూ.50వేల విరాళం ఆలయ కమిటీకి సోమవారం అందజేశారు. దాతకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం

దత్తిరాజేరు: వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోనున్నామని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, ఆర్‌డబ్ల్యూ ఎస్ ఇన్‌చార్జి ఏఈ నానిబాబు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మండలం లో మార్చి 1 నుంచి క్రాష్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు చెప్పారు. 35 గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న చేతి బోర్లకు మరమ్మతులు చేపడతా మని, అవసరమైన బోర్లకు కొత్త పరికరాలు అమర్చుతామని స్పష్టం చేశారు. కార్యక్రమ నిర్వహణకు సంబంధించిన షెడ్యూల్‌ను సిద్ధం చేస్తున్నామని వివరించారు.

నవధాన్యాల సాగుతో భూమిసారవంతం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

దత్తిరాజేరు: నవధాన్యాల సాగుతో భూమి సారవంతమవుతుందని ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి కాసులమ్మ అన్నారు. నవధాన్యాల సాగుపై మండలంలోని వింధ్యవాసి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సోమవారం రైతులు, ఉపాధి వేతనదారులు, పొదుపు సంఘాల మహిళలతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాసులమ్మ మాట్లాడుతూ పొదుపు సంఘాల మహిళలకు గ్రామ సమాఖ్య ద్వారా నవధాన్యాల విత్తనాలు ఉచితంగా అందజేయనున్నట్లు చెప్పారు. నవధాన్యాల సాగు చేసిన పొలాల్లో తర్వాత వేసే ప్రధాన పంటలకు రసాయన ఎరువులను వినియోగించాల్సిన అవసరం ఉండదని, పెట్టుబడి ఆదా అవుతుందని అన్నారు.

బైజూస్ ట్యాబ్స్ వినియోగించాలి

- ఎంఈఓ శ్రీదేవి

వేపాడ: ఎనిమిదో తరగతి విద్యార్థులు బైజూస్ ట్యాబ్స్ ప్రతిరోజూ వినియోగించేలా చూడాలని ఉపాధ్యాయులకు ఎంఈఓ జి.శ్రీదేవి సూచించారు. నీలంకంఠరాజపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా బైజూస్ ట్యాబ్ వినియోగంపై ఆరా తీశారు. ఎస్‌సీఈఆర్‌డీఏపీ రూపొందించిన అకడమిక్ క్యాలెండర్ ప్రకారం సిలబస్ పూర్తి చేయాలన్నారు. విద్యార్థులతో నోట్స్ రాయించడం, వాటిని పరిశీలించడం చేయాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.



నీలకంఠరాజపురం హైస్కూల్‌లో బైజుస్ ట్యాబ్ వినియోగంపై విద్యార్థినిని ఆరా తీస్తున్న ఎంఈఓ శ్రీదేవి

గజపతినగరంలో 'ఫ్యామిలీ డాక్టర్'



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారికి వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ సాయికృష్ణారెడ్డి

గజపతినగరం: స్థానిక గ్రామ సచివాలయం–1 పరిధిలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సచివాలయం వద్ద శిబిరం ఏర్పాటు చేసి ఓపీ(అవుట్ పేషెంట్) సేవలందించారు. 65 మందికి వివిధ వైద్యపరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్యంపై ఆరా తీసి, వృద్ధులు, గర్భిణులు, బాలింతలకు వైద్యతనిఖీలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలను సందర్శించి పిల్లలకు వైద్యపరీక్షలు చేశారు. ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. మరుపల్లి పీహెచ్‌సీ,104 వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సరోజినీనాయుడు జీవితం ఆదర్శనీయం

లక్కవరపుకోట: భారత కోకిల (నైటింగేల్ ఆఫ్ ఇండియా),స్వాతంత్ర్య సమరయోధురాలు సరోజినీ నాయుడు జీవితం మహిళాలోకానికి ఆదర్శప్రాయమని మహాత్మ జ్యోతిరావుపూలే బాలికల ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ యు. విజయ్‌కుమార్ పాత్రో అన్నారు. జమ్మాదేవిపేట గ్రామం సమీపంలోని ఆశ్రమ పాఠశాలలో సరోజినీనాయుడు జయింతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థినులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సరోజినీనాయుడు ప్రసిద్ధిగాంచిన కవయిత్రి అని విదేశాల్లో ఉన్నత చదువులు చదివారని, స్వాతంత్యం ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారని తెలిపారు. దేశంలో మొట్టమొదటి మహిళా గవర్నర్‌గా కూడా ఆమె పనిచేశారని వివరించారు.



సరోజినీనాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

డిగ్రీ ప్రవేశాలకు ప్రత్యేక క్యాంపెయిన్



అనంతగిరి జూనియర్ కళాశాలలో క్యాంపెయిన్ నిర్వహిస్తున్న డిగ్రీ కళాశాల అధ్యాపకులు

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కోసం ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.కేశవరావు నేతృత్వంలో సోమవారం ప్రత్యేక క్యాంపెయిన్ ప్రారంభించారు. డిగ్రీ కళాశాల అధ్యాపకులు విశాఖపట్నం జిల్లాలోని అనంతగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లి అక్కడ సీనియర్ ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సౌకర్యాలు, వసతుల గురించి వివరించారు. కళాశాలలో చేరి ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, డిజిటల్–వర్చ్యువల్ క్లాసులు, మోడ్రన్ జిమ్, డిజిటల్ లైబ్రరీ, జేకేసీ వంటి వసతులు, సౌకర్యాలను ఉపయోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల ఉపన్యాసకులు జి.ఈరన్న, సీహెచ్.శ్రీనివాసరావు, వలీఖాన్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన అవసరం

చీపురుపల్లిరూరల్(గరివిడి): హక్కులపై ప్రతీ మహిళ అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర మానవహక్కుల ఫౌండేషన్ ఉపాధ్యక్షురాలు బోగాపురం శ్రీదేవి అన్నారు. గరివిడిలో గ్రామైక్య సంఘాల సహాయకులకు హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హక్కులపై సోమవారం అవగాహన కల్పించారు. రాజ్యాంగం మహిళలకు ప్రత్యేక హక్కులు కల్పించిందని, వాటి గురించి అంతా తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ రీజియన్ అధ్యక్షుడు ఎం.హరీష్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు వై.రామ్మోహన్‌రావు, నియోజకవర్గ అధ్యక్షుడు బి.సూర్యనారాయణ, ఏపీఎం పద్మ, విజయ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శ్రీదేవి

తాగునీటి సరఫరాకు ఏర్పాట్లు

భోగాపురం/పూసపాటిరేగ: భోగాపురం మండలంలో నిర్మించనున్న విమానాశ్రయానికి మంచినీరు సరఫరాకు చేసేందుకు పూసపాటిరేగ మండలంలోని పాత నడిపిల్లి, కొప్పెర్ల, భోగాపురం మండలంలోని నందిగాం తీర ప్రాంతంలో ఉన్న చంపావతి నదిని ఎన్‌జీఆర్‌ఐ సైంటిస్ట్ డి.మురళీధరన్ సోమ వారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విమానాశ్రయానికి మంచి నీటిని సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. విమానాశ్రయానికి ఒక రోజుకు 5 మిలియన్ల నీరు అవసరముంటుదని, ఈ మేరకు పూసపాటిరేగ మండలంలోని పాత నడిపిల్లి, కొప్పెర్ల, భోగాపురం మండలంలోని నందిగాం ప్రాంతం నుంచి చంపావతి నీరు తరలించేందుకు సాధ్యాసాధ్యాలపై పరిశీలన చేస్తున్నట్లు చెప్పారు. అలాగే సముద్ర తీర ప్రాంతాలకు ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆదేశాల మేరకు జల్‌జీవన్ మిషన్ ద్వారా తాగునీరు సరఫరా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఉమాశంకర్, ఈఈ ఏవీఎస్ రాజన్, ఏఈ హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.